# శిరీష ఘటనపై అసెంబ్లీలో ఎమ్మెల్యే జారె ప్రస్తావన

- విచారణ వేగవంతం చేసి.. నేరం రుజువైతే కఠిన శిక్ష పడేలా చూడాలి
- మహిళలకు భద్రత కల్పించడంలో మరింత పటిష్టమైన వ్యవస్థ అవసరం
- గ్రామీణ, ఆదివాసీ యువతుల రక్షణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలి

**దమ్మపేట, సెప్టెంబరు. 19, (ప్రజా జ్యోతి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ములకలపల్లి మండలం చౌటిగూడెంకు చెందిన ఊకె శిరీష ఘటనను అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అసెంబ్లీలో ప్రస్తావించారు. ఈ ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొంటూ మహిళలు, యువతుల రక్షణకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని సభ దృష్టికి తీసుకెళ్లారు.ఉపాధి, ఉద్యోగాలు, విద్య కో.సం స్వగ్రామాలను విడిచి హైదరాబాద్ వంటి నగ



రాలకు వెళ్లే గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల

మిగతా 2 లో...

జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 20 | సెప్టెంబర్ | 2026 ◆ పేజీలు : 6

# పోలీస్ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్యే జారె నారాయణ సహచర ఎమ్మెల్యేలు విజ్ఞప్తి



**అశ్వారావు పేట , ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19** ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న స్థానిక ఆదివాసీ, గిరిజన నిరుద్యోగ యువతకు పోలీస్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె నారాయణ, సహచర ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు, రాందాస్ నాయక్‌లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ అందజేశారు. అంతకుముందు అసెంబ్లీలోనూ అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ, ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువతకు పోలీస్ ఉద్యోగాల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాల్సిన అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారు. 2026లో విడుదలైన పోలీస్ కానిస్టేబుల్

మిగతా 2 లో...

- నిన్నటి చర్చల్లో అవకాశం కల్పించారా?
- సామాన్యుడు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు.. పెద్దల బంగారం మాత్రం విడుదలైనట్లు సమాచారం
- పైరవీల వెనుక ఎన్ని లక్షలు? రూ.35 లక్షల వ్యవహారం ఒక్కరి పైనే ఎందుకు?




2 లో..

## సూత్రధారులు తప్పించుకున్నారా..

# బడాబాబులకు మినహాయింపా?

అశ్వారావుపేటలో వెలుగులోకి వచ్చిన గోల్డ్ లోన్ వ్యవహారం రోజుకో కొత్త అనుమానానికి తెరలేపుతోంది. ఒకవైపు సామాన్య ఖాతాదారులు తమ బంగారం పరిస్థితి ఏమిటో తెలియక బ్యాంకు చుట్టూ తిరుగుతుండగా.. మరోవైపు కొందరు బడా వ్యక్తులు తాకట్టు పెట్టిన బంగారాన్ని పూర్తిగా విడుదల చేసుకున్నట్లు సమాచారం వెలుగులోకి రావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. నిన్న జరిగిన చర్చల్లో కొందరికి ప్రత్యేకంగా అవకాశం కల్పించారా? ఆ అవకాశం ఉపయోగించుకుని తమ బంగారాన్ని తీసుకెళ్లారా? అనే అనుమానాలు బాధితుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణల్లో నిజమెంత అన్నది బ్యాంకు రికార్డులు, గోల్డ్ లోన్ ఖాతాలు, విడుదల వివరాలు పరిశీలిస్తేనే స్పష్టమవుతుంది.

● అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

# భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 19 ,(ప్రజా జ్యోతి)**(కొత్తగూడెం జిల్లాలో కొనసాగుతున్న భూ రీ సర్వే పనులను శనివారం జిల్లా కలెక్టర్ అంకిత్ పరిశీలించారు. ఇందులో భాగంగా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, పరికరాలను వినియోగిస్తూ చేపడుతున్న డిజిటల్ భూ రీ సర్వే ప్రక్రియను బూర్గంపాడు మండలంలోని పినపాక పట్టీ నగర్ రెవెన్యూ విలేజ్ అంజనాపురం ప్రాంతంలో డిజిటల్ భూ రీ సర్వే పనుల కలెక్టర్ పరిశీలించారు.సర్వేలో అనుసరిస్తున్న విధానం, భూముల కొలతలు, వివరాల నమోదు తదితర అంశాలను బూర్గంపాడు తహసీల్దార్ ప్రసాద్ ను అడిగి తెలుసుకున్నారు.ఇప్పటివరకు పూర్తయిన సర్వే పనుల పురోగతిపై సమీక్షించి, నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత లైసెన్సు సర్వేయర్లు యుగేందర్,అనూష లను జిల్లా కలెక్టర్ ఆదేశించారు.ఈ క్రమంలో 118 సర్వే నెంబర్ లో 1863 ఎకరాలకు



గాను 1698 ఎకరాలు రీ సర్వే పూర్తయిందని జిల్లా కలెక్టర్ కు సర్వేర్లు తెలియజేశారు. అటవీశాఖకు సంబంధించిన భూములు సుమారు 200 ఎకరాలు ఉండగా వాటికి అనుమతులు వస్తే సరిహద్దులు సర్వే పూర్తి చేస్తామని సర్వేయర్లు తెలిపారు.అనంతరం స్థానిక రైతులు తమ్మినేని వెంకటేశ్వర్లు,

మిగతా 2 లో...

# రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి: డీఎస్పీ

**ఇల్లందు, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి)** రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇల్లందు డిఎస్పి యు వెంకన్న బాబు హెచ్చరించారు. జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు శనివారం ఇల్లందు పోలీస్ స్టేషన్ సబ్ డివిజన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్లు శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా, నేరాలకు పాల్పడినా చట్టప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీషీటర్ల కదలికలు, ప్రవర్తనపై పోలీసుల నిఘా నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా బెదిరింపులు, దాడులు, అక్రమ కార్యకలాపాలు,



ఇతర నేరాలకు పాల్పడితే ఉపేక్షించబోమని హెచ్చరించారు. రౌడీషీటర్లు తమ గత నేర చరిత్రను పక్కనపెట్టి కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవిస్తూ, సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా మెలగాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీస్ శాఖ కఠినంగా వ్యవహరిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సిఐలు తాటిపాముల సురేష్, బత్తుల సత్యనారాయణ, ఎస్ఐలు తిరుపతి, ఉమా, సారంగపాణి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## శిరీష ఘటనపై అసెంబ్లీలో ఎమ్మెల్యే జారె ప్రస్తావన

(మొదటి పేజీ తరువాయి...)

యువతుల సంఖ్య పెరుగుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా నివసించే సమయంలో వారికి ఎదురయ్యే భద్రతా సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించాలని కోరారు. ఇతర ప్రాంతాలకు వెళ్లే మహిళలకు అత్యవసర పరిస్థితుల్లో వెంటనే సహాయం అందేలా సమన్వయ వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని సూచించారు.

**ఘటనల నివారణకు ముందస్తు చర్యలు**

మహిళలపై దాడులు, వేధింపులు వంటి ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని జారె ఆదినారాయణ అన్నారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, పోలీసు నిఘాను పెంచడం, అత్యవసర సేవలపై మహిళలకు అవగాహన కల్పించడం వంటి చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమస్య ఎదురైన వెంటనే పోలీసులను సంప్రదించే విధంగా మహిళల్లో ధైర్యాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు.

**విచారణలో జాప్యం లేకుండా చూడాలి**

శిరీష ఘటనపై దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే కోరారు. కేసులో నేరం రుజువైన వారికి చట్టప్రకారం కఠిన శిక్ష పడేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మహిళలకు సంబంధించిన కేసుల్లో దర్యాప్తు, న్యాయ ప్రక్రియలు సమర్థవంతంగా సాగేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

**మారుమూల ప్రాంతాలకు భద్రతా సేవలు**

ఆదివాసీ, మారుమూల గ్రామాల్లో నివసించే మహిళలకు పోలీసు, అత్యవసర సేవలు సులభంగా అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే సూచించారు. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా మహిళల సమస్యలను గుర్తించి సంబంధిత శాఖల సమన్వయంతో కార్యాచరణ రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు.

**బాధిత కుటుంబానికి అండగా ప్రభుత్వం**

శిరీష కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచి అవసరమైన సహాయం అందించాలని జారె ఆదినారాయణ కోరారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా భద్రతా వ్యవస్థలో అవసరమైన మార్పులు తీసుకురావాలని అన్నారు. మహిళల రక్షణను ప్రభుత్వ ప్రాధాన్య అంశంగా తీసుకుని గ్రామీణ, ఆదివాసీ ప్రాంతాల నుంచి పట్టణాలకు వెళ్లే మహిళలకు అవసరమైన భద్రతా చర్యలను అందుబాటులోకి తీసుకురావాలని అసెంబ్లీలో విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ ఉద్యోగాల్లో ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు 75 శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

( ఎస్టి సివిల్ కానిస్టేబుల్ నియామాక నోటిఫికేషన్‌లో ఏజెన్సీ ప్రాంతాలకు సంబంధించిన పోస్టుల్లో 75 శాతం రిజర్వేషన్ అమలు చేయకపోవడం వల్ల స్థానిక ఆదివాసీ, గిరిజన నిరుద్యోగ యువతకు నష్టం జరుగుతోందని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని స్థానిక గిరిజన యువతకు ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం కల్పించేందుకు గతంలో అమల్లో ఉన్న ప్రత్యేక నిబంధనలను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. ప్రస్తుతం కొనసాగుతున్న పోలీస్ నియామక ప్రక్రియలోనూ 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. పోలీస్ సివిల్ కానిస్టేబుల్ నియామకాలకు సంబంధించి జీవో ఎంఎస్ నెంబర్ .109, తేదీ 17.06.1988, అలాగే గెజిట్ నోటిఫికేషన్ నెంబర్.49, తేదీ 10.05.2018 ద్వారా ఏజెన్సీ ప్రాంతాల్లో 75 శాతం రిజర్వేషన్‌కు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు ఉన్న విషయాన్ని లేఖలో ప్రస్తావించారు. ఏజెన్సీ ప్రాంతాల ప్రత్యేక పరిస్థితులు, అక్కడి స్థానిక గిరిజన యువతకు ఉన్న ఉపాధి అవకాశాలను దృష్టిలో ఉంచుకుని ఈ రిజర్వేషన్‌ను అమలు చేయడం అవసరమని పేర్కొన్నారు. ముఖ్యంగా పినపాక నియోజకవర్గంతో పాటు రాష్ట్రంలోని అన్ని ఏజెన్సీ ప్రాంతాల గిరిజన నిరుద్యోగ యువతకు న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. 2026 పోలీస్ నియామక ప్రక్రియలో 75 శాతం రిజర్వేషన్ అమలు చేసేలా అవసరమైన చర్యలు తీసుకుని, ఏజెన్సీ ప్రాంతాల గిరిజన యువత భవిష్యత్తును కాపాడాలని మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు జారె ఆదినారాయణ, పాయం వెంకటేశ్వర్లు, వెడ్మ బొజ్జు, రాందాస్ నాయక్‌లు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు.

- నిన్నటి చర్చల్లో అవకాశం కల్పించారా?
- సామాన్యుడు బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు.. పెద్దల బంగారం మాత్రం విడుదలైనట్లు సమాచారం
- పైరవీల వెనుక ఎన్ని లక్షలు? రూ.35 లక్షల వ్యవహారం ఒక్కరి పైనే ఎందుకు?




## సూత్రధారులు తప్పించుకున్నారా..

# బడాబాబులకు మినహాయింపా?

**అశ్వారావుపేటలో వెలుగులోకి వచ్చిన గోల్డ్ లోన్ వ్యవహారం రోజుకో కొత్త అనుమానానికి తెరలేపుతోంది. ఒకవైపు సామాన్య ఖాతాదారులు తమ బంగారం పరిస్థితి ఏమిటో తెలియక బ్యాంకు చుట్టూ తిరుగుతుండగా.. మరోవైపు కొందరు బడా వ్యక్తులు తాకట్టు పెట్టిన బంగారాన్ని పూర్తిగా విడుదల చేసుకున్నట్లు సమాచారం వెలుగులోకి రావడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. నిన్న జరిగిన చర్చల్లో కొందరికి ప్రత్యేకంగా అవకాశం కల్పించారా? ఆ అవకాశం ఉపయోగించుకుని తమ బంగారాన్ని తీసుకెళ్లారా? అనే అనుమానాలు బాధితుల్లో వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణల్లో నిజమెంత అన్నది బ్యాంకు రికార్డులు, గోల్డ్ లోన్ ఖాతాలు, విడుదల వివరాలు పరిశీలిస్తేనే స్పష్టమవుతుంది.**

● అశ్వారావుపేట, ప్రజాజ్యోతి

**సామాన్యుడికి మాత్రం చుక్కెదురు!**

తమ బంగారం కోసం సామాన్య ఖాతాదారులు బ్యాంకు చుట్టూ తిరుగుతున్న పరిస్థితి కనిపిస్తోందని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము తీసుకున్న రుణానికి మించి అదనపు అప్పు కనిపిస్తోందని, తమ బంగారం విలువకు సంబంధించి మరిన్ని బకాయిలు ఉన్నట్లు చూపిస్తున్నారని కొందరు చెబుతున్నట్లు సమాచారం.

బంగారం ఎక్కడుంది? తమ పేరుతో ఎంత రుణం ఉంది? ఎవరు ఆ రుణాన్ని ఉపయోగించారు? అనే ప్రశ్నలకు సమాధానాలు దొరకక బాధితులు అయోమయంలో ఉన్నారని తెలుస్తోంది.

**బడాబాబుల బంగారం ఎలా విడుదలైంది?**

సామాన్యులు తమ బంగారం కోసం ఎదురుచూస్తుంటే..కొందరు పెద్ద మొత్తాల్లో బంగారం తాకట్టు పెట్టిన వ్యక్తులు మాత్రం తమ బంగారాన్ని పూర్తిగా విడిపించుకున్నారనే సమాచారం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఇది సాధారణ ప్రక్రియలో జరిగిందా? లేక నిన్నటి చర్చల సందర్భంగా ప్రత్యేక అవకాశం కల్పించారా? బంగారం విడుదలకు సంబంధించిన రికార్డులు ఏమి చెబుతున్నాయి? ఎవరి ఖాతా నుంచి ఎప్పుడు బంగారం విడుదలైంది? అన్నదే అసలు ప్రశ్న.

**పైరవీలకు ఎన్ని లక్షలు?**

"బడాబాబులను తప్పించేందుకు పైరవీలు జరిగాయా? జరిగితే ఎన్ని లక్షలకు బేరం కుదిరింది?" అంటూ కొందరు సామాన్యులు ఆరోపణలు చేస్తు



న్నారు.

**రూ.35 లక్షల వ్యవహారం ఒక్కరి పైనేనా?**

అశ్వారావుపేట మండలానికి చెందిన ఒక వ్యక్తి సుమారు రూ.35 లక్షలు తన సొంత అవసరాలకు వినియోగించినట్లు ప్రచారంలో ఉంది. అయితే ఇంత పెద్ద మొత్తానికి సంబంధించిన వ్యవహారం ఒక్క వ్యక్తి వల్లే జరిగిందా? లేక వెనుక మరికొందరి సహకారం ఉందా? అన్న ప్రశ్నలు స్థానికంగా వినిపిస్తున్నాయి.

ముఖ్యంగా సుబ్బు అనే వ్యక్తి ఒక్కరే ఈ వ్యవహారానికి బాధ్యత వహిస్తున్నట్లుగా ఎందుకు కనిపిస్తోంది? అసలు లావాదేవీల వెనుక మరెవరైనా ఉన్నారా? అనే అంశం కూడా దర్యాప్తులో తేలాల్సి ఉంది.

**గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారుల పాత్ర ఉందా?**

అశ్వారావుపేటకు చెందిన కొందరు ప్రముఖ గోల్డ్ ఫైనాన్స్, తాకట్టు వ్యాపారస్తులకు ఈ వ్యవహారంతో సంబంధాలు ఉన్నాయంటూ స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. సుబ్బుకు కొందరు గోల్డ్ వ్యాపారులతో ఆర్థిక లావాదేవీలు ఉన్నట్లు ఆధారాలు ఉన్నాయని పలువురు చెబుతున్నప్పటికీ, వాటిని అధికారికంగా ధృవీకరించాల్సి ఉంది. ఒకవేళ బ్యాంకు నుంచి తీసుకున్న బంగారం ఇతర గోల్డ్ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టినట్లు తేలితే.. ఆ బంగారం ఎవరి ద్వారా వెళ్లింది? ఎవరు స్వీకరించారు? ఏ పత్రాలపై తాకట్టు పెట్టారు? డబ్బు ఎవరి ఖాతాలకు వెళ్లింది? అన్న అంశాలు కీలకంగా మారనున్నాయి.

**సమగ్ర పోలీసు విచారణతోనే అసలు నిజాలు**

ఈ వ్యవహారంలో అసలు సూత్రధారులు ఎవరు? ఎవరు పాత్రధారులు? ఎవరి బంగారం విడుదలైంది? సామాన్యుల బంగారం పరిస్థితి ఏమిటి? రూ.35 లక్షల లావాదేవీ వెనుక అసలు కథ ఏమిటి? గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారులతో ఎలాంటి లావాదేవీలు జరిగాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు రావాలంటే సమగ్ర పోలీసు దర్యాప్తు అవసరమనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

సామాన్యుడి బంగారం కోసం బ్యాంకు గుమ్మం వద్ద పడిగాపులు.. పెద్దల బంగారం మాత్రం బయటకు వెళ్లిందనే ఆరోపణలు నిజమైతే బాధ్యత ఎవరిది? అనే ప్రశ్న ఇప్పుడు అశ్వారావుపేటలో చర్చనీయాంశంగా మారింది.

## భూ రీ సర్వేను వేగవంతంగా పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

తిరుపతయ్య,కొట్టే వెంకటేశ్వర్లు భానోత్ రాజు, దాసరి ఆదినారాయణ జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి భూ రీ సర్వేకు సంబంధించి వారి అభిప్రాయాలు, సమస్యలు, సందేహాలను అడిగి తెలుసుకున్నారు. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన వివరాలను అధికారులకు అందించి సహకరించాలని కలెక్టర్ కోరారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపడుతున్న రీ సర్వే ద్వారా భూముల వివరాలు మరింత కచ్చితంగా నమోదు కావడంతో పాటు భవిష్యత్‌లో భూ సంబంధిత సమస్యలను తగ్గించేందుకు అవకాశం ఉంటుందని తెలిపారు. అధికారులు, సర్వే సిబ్బంది, రైతులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ రీ సర్వే ప్రక్రియ విజయవంతంగా పూర్తయ్యేలా సహకరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ పరిశీలనలో పినపాక పట్టీ నగర్ సర్పంచ్ బాణోత్ పద్మ,ఉప సర్పంచ్ వెంకటరమణ, అధికారులు, సిబ్బంది, స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.



# వినాయక నిమజ్జనానికి అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

- ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలతో పూర్తి చేయాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 19, (ప్రజాజ్యోతి)** భద్రాచలం పట్టణంలో వినాయక నిమజ్జన కార్యక్రమం విజయవంతంగా, శాంతియుతంగా జరిగేందుకు అన్ని ఏర్పాట్లు చేపెట్టాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శనివారం భద్రాచలం గోదావరి నది తీర ప్రాంతంలో నిమజ్జన ఘాట్‌ల వద్ద జరుగుతున్న నిమజ్జన ఏర్పాట్లను పరిశీలించారు.నిమజ్జనానికి లాంచీలు బారికేడింగ్, లైటింగ్, సీ.సీ కెమెరాల పర్యవేక్షణ, తాగునీరు, వైద్య బృందాలు, గజ ఈతగాళ్లు వంటి అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులకు కలెక్టర్ వివరించారు. నదీ తీర ప్రాంతంలో ఎటువంటి అపశృతి జరగకుండా రక్షణ చర్యలు చేపట్టాలని భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ్ , డీఎస్పీ అరుణ్ కుమార్ లకు సూచించారు.ఈ నెల 24,25,26 వ తేదీల్లో జరిగే నిమజ్జనానికి పోలీస్,రెవెన్యూ, రవాణా, వైద్య ఆరోగ్య,అగ్నిమాపక, అటవీ, ఇరిగేషన్,దేవాదాయ,పంచాయతీ శాఖల అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షించి ఉన్నతాధికారులకు సమాచారం అదించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలతో పాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వినాయక నిమజ్జనానికి భద్రాచలం రానున్నారని తెలిపారు.నిర్దేశించిన ప్రదేశాలలోనే వినాయక నిమజ్జనం చేయాలని,ప్రణాళికా బద్ధంగా పనిచేసేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలనిజిల్లా కలెక్టర్ స్పష్టం చేశారు. వాహనాలను నిర్దిష్ట పార్కింగ్ ప్రాంతాల్లోనే నిలపాలని, మద్యం సేవించి నిమజ్జన కార్యక్రమాలకు రాకూడదని, విగ్రహాల నిమజ్జనం క్రమపద్ధతిలో జరగాలని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు,ఊరేగింపుల సమయంలో డీ.జేలు, అధిక శబ్దపూరిత మ్యూజిక్ వాడకూడదని, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా మున్సిపల్, పోలీస్ శాఖల సూచనల మేరకు మాత్రమే ఊరేగింపులు కొనసాగించాలన్నారు.జిల్లా ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో, క్రమశిక్షణతో, శాంతియుతంగా వినాయక నిమజ్జన కార్యక్రమం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.అనంతరం దేవాలయంలో జరుగుతున్న అభివృద్ధి పున నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. ఉత్తర ద్వార దర్శనం,చిత్రకూట మండపం పరిసరాలను,గోశాల ప్రాంతాన్నీ, అన్నదాన సత్రం,విస్తా కాంప్లెక్స్, శివాలయానికి వెళ్లే మార్గం, రామాలయంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు మాడవీధులను, పరిసర ప్రాంత అభివృద్ధి నిర్మాణ పనులను పరిశీలించారు. అభివృద్ధికి సంబంధించిన వివరాలను సంబంధిత అధికారుల నుంచి అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి నాణ్యతా లోపాలు లేకుండా, దశాబ్దాల కాలం పాటు నిర్మాణాలు ప్రతిష్టంగా ఉండేలా చూసుకోవాలని స్పష్టం చేశారు. గోదావరి పుష్కరాల ప్రారంభంలోపు గోదావరి పరివాహక ప్రాంతంలో గల గోదావరి ఘాట్లు నిర్మాణాలు అభివృద్ధి పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం సర్పంచ్ పూనం కృష్ణ,డీఎస్పీ అరుణ్ కుమార్,పంచాయతీ ఈ.ఓ శ్రీనివాస్ రావు, దేవాలయ ఈ.వో దామోదర్ రావు,ఏం.వీ.ఐ సంఘం వెంకట పుల్లయ్య ఇరిగేషన్ ఏ.ఈ.ఈ లు రవితేజ, గణేష్, ఐ.టీ.సీ ప్రతినిధులు చెంగల్ రావు, దుర్గాప్రసాద్, వివిధ శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మలుపుల్లో మృత్యు ముప్పు!



**సుజాతనగర్, సెప్టెంబర్ 19, ప్రజా జ్యోతి** నర్సింహసాగర్–కొత్త అంజనాపురం రహదారిపై పెరిగిన చెట్లతో తగ్గిన దృశ్యమానతనర్సింహసాగర్–కొత్త అంజనాపురం గ్రామాల మధ్య రహదారి పక్కన పెరిగిన చెట్లు, పొదలతో ప్రమాదకర మలుపుల వద్ద ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. దీంతో వాహనదారులు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. సుమారు 7 మలుపులు ఇదే తరహాతో ఉండడం గమనార్హం.రహదారిపై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లు, వ్యవసాయ వాహనాలకు ఈ సమస్య మరింత ప్రమాదకరంగా మారింది. ముఖ్యంగా ఉదయం, సాయంత్రం వేళల్లో ఎదురుగా వచ్చే వాహనాలను ముందుగానే గుర్తించడం కష్టంగా మారుతోంది. చెట్ల కొమ్మలు, పొదలు తొలగించి రహదారికి ఇరువైపులా అవసరమైన మేరకు క్లియర్ విజిబిలిటీ కల్పించాలని ప్రయాణికులు కోరుతున్నారు.నాలుగు నెలల క్రితం ఇదే మార్గంలో బైక్ ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన నేపథ్యంలో గ్రామస్తుల్లో ఆందోళన మరింత పెరిగింది. మరో ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి రహదారి పక్కన ఉన్న చెట్ల కొమ్మలు,పొదలను తక్షణమే తొలగించి స్పష్టమైన దృశ్యమానత కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

### ప్రమాదం తర్వాత కాదు.. ముందే మేల్కొనాలి!



ప్రమాదకర మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు, రిఫ్లెక్టర్లు ఏర్పాటు చేసి, రహదారి క్లియరెన్స్ చేపట్టాలని గ్రామస్తులు సం బంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నా రు. ప్రజల ప్రాణ భద్రత కోసం అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## ఐస్టా-2026 జాతీయస్థాయి టెన్నిస్ క్రీడలు పాల్వంచలో నిర్వహించడం హర్షణీయం

- సొసైటీ ఛైర్మన్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ కొత్వాల






**కొత్తగూడెం కలెక్టరేట్, సెప్టెంబర్ 19,(ప్రజాజ్యోతి)** ఆల్ ఇండియా టెన్నిస్ టోర్నమెంట్‌ను పాల్వంచ పట్టణంలో నిర్వహించడం హర్షణీయమని పాల్వంచ సొసైటీ ఛైర్మన్, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ పట్టణ 8వ డివిజన్ శ్రీనివాసకాలనిలో శ్యామలా గోపాలన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయస్థాయి పోటీలు ప్రారంభమయ్యాయి. రెండవరోజు పోటీల సందర్భంగా శనివారం కొత్వాల పాల్గొని క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులతో కలిసి టెన్నిస్ క్రీడను తిలకించారు.ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ జాతీయస్థాయి లో టెన్నిస్ క్రీడలు పాల్వంచలో నిర్వహించడం గర్వకారణమన్నారు. ఈ టోర్నమెంట్లో 80–85 సంవత్సరాల వయస్సు మీరినవారు కూడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనడం విశేషమన్నారు. క్రీడాకారులు ప్రతిభ కనపరిచి పాల్వంచకు మంచి పేరు తీసుకురావాలని కొత్వాల అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు వై. వెంకటేశ్వర్లు, యర్రంశెట్టి ముత్తయ్య, కొండం వెంకన్నగౌడ్, కందుకూరి రాము, బూసి శ్రీను, వాసు, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

## యూపీఐ చార్జీలు ఉపసంహరించాలి

- సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్



**దమ్మపేట, సెప్టెంబరు. 19,(ప్రజాజ్యోతి) :** యూపీఐ డిజిటల్ చెల్లింపులపై చార్జీలు విధించే నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పిట్టల అర్జున్ డిమాండ్ చేశారు. శనివారం రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సీఐటీయూ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు.డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహిస్తూ గత కొన్నేళ్లుగా యూపీఐ వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం విస్తరించిందన్నారు. ప్రస్తుతం ఉద్యోగులు, రైతులు, చిన్న వ్యాపారులు, చిరు దుకాణదారులు, అసంఘటిత కార్మికులు సహా కోట్లాది మంది రోజువారీ లావాదేవీలకు యూపీఐపై ఆధారపడుతున్నారని తెలిపారు. ఇలాంటి ప్రజా వినియోగ వ్యవస్థపై చార్జీలు విధించడం సామాన్యులపై అదనపు ఆర్థిక భారం మోపడమేనన్నారు.కూరగాయలు, పండ్ల వ్యాపారులు, చిన్న దుకాణదారులు, స్వయం ఉపాధి పొందుతున్నవారు నిత్యం యూపీఐ ద్వారా చెల్లింపులు స్వీకరిస్తున్నారని పేర్కొన్నారు. నగదు రహిత లావాదేవీలను ప్రోత్సహించి, ఇప్పుడు అదే వ్యవస్థపై చార్జీలకు తలుపులు తెరవడం సరికాదన్నారు. పెంచిన యూపీఐ చార్జీల నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి తీసుకోవాలని అర్జున్ డిమాండ్ చేశారు.సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ మురారి రఘు, విక్రమ్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఎంపీడీవో ముత్యాలరావు.. జన్మదిన వేడుకలు

- నవచైతన్య ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఘనంగా సన్మానం

**అశ్వాపురం, సెప్టెంబర్ 19:ప్రజాజ్యోతి** మండల ఎంపీడీవో ముత్యాలరావు జన్మదిన వేడుకలు నవచైతన్య ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో శనివారం మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులు ఎంపీడీవో ముత్యాలరావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేయించి ఆనందాన్ని పంచుకున్నారు.ఈ సందర్భంగా ప్రెస్‌క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. ముత్యాలరావు ప్రజలకు అందుబాటులో ఉంటూ తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తున్న అధికారిగా పేర్కొన్నారు. మండలంలోని వివిధ గ్రామాల నుంచి ప్రజలు తమ సమస్యలను తీసుకుని కార్యాలయానికి వచ్చినప్పుడు వారి సమస్యలను ఓపికగా విని, పరిష్కారానికి అవసరమైన మార్గాన్ని సూచిస్తూ చొరవ చూపుతారని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంలో సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకోవడంతో పాటు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా కృషి చేస్తున్నారని అన్నారు. అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూనే ప్రజలతో స్నేహపూర్వకంగా మెలగడం, ప్రతి ఒక్కరినీ గౌరవంగా పలకరించడం ఆయన ప్రత్యేకతగా పేర్కొన్నారు.మండలంలోని గ్రామీణ ప్రాంతాల ప్రజలకు ప్రభుత్వ కార్యాలయాలపై అవగాహన కల్పించడంతో పాటు, వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సమస్య వచ్చినప్పుడు ముందుగా స్పందించి పరిష్కార మార్గాన్ని చూపించే అధికారిగా ముత్యాలరావు ప్రజలతో మంచి అనుబంధాన్ని ఏర్పరుచుకున్నారని తెలిపారు.ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, మీడియా ప్రతినిధులతో సత్సంబంధాలు కొనసాగిస్తూ మండల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నారని ప్రెస్‌క్లబ్ సభ్యులు పేర్కొన్నారు. ప్రజలకు సంబంధించిన అంశాల్లో సానుకూలంగా స్పందిస్తూ, అందుబాటులో ఉండే అధికారిగా వ్యవహరిస్తున్నందుకు ముత్యాలరావుకు అభినందనలు తెలిపారు.జన్మదిన వేడుకల సందర్భంగా ఎంపీడీవో ముత్యాలరావుకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని, భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి ప్రజలకు సేవలందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో నవచైతన్య ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కొడారి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు రామిరెడ్డి, ప్రచార కార్యకర్త దేపంగి వెంకటరమణ, కోశాధికారి కదిర్, కుమార్, ఇరుగు సతీష్ తదితరులు పాల్గొని ఎంపీడీవో ముత్యాలరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.



## విద్యార్థుల భవిష్యత్తులో తల్లిదండ్రులదే కీలకపాత్ర

- మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు



**దమ్మపేట,సెప్టెంబరు. 19,(ప్రజాజ్యోతి):** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్)లో హెడ్మాస్టర్ ఆధ్వర్యంలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశానికి అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు తాటి వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి నెల మూడో శనివారం పేరెంట్స్ సమావేశం నిర్వహించడం అభినందనీయమన్నారు. పాఠశాలలో సుమారు 500 మంది విద్యార్థులు చదువుతున్నప్పటికీ సమావేశానికి కేవలం 25 మంది తల్లిదండ్రులు మాత్రమే హాజరుకావడం బాధాకరమన్నారు. తమ పిల్లలు పాఠశాలలో ఎలా చదువుతున్నారు, వారి విద్యా ప్రగతి ఏ విధంగా ఉంది, చదువులో ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారా అనే విషయాలను తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాల్సిన బాధ్యత ఉందన్నారు. పిల్లల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి వారి నైపుణ్యాలను వెలికితీసేలా ఉపాధ్యాయులు కృషిచేస్తున్నారని తెలిపారు. ప్రైవేటు పాఠశాలల్లో లక్షల రూపాయలు ఖర్చు చేసి పిల్లలను చదివిస్తున్న తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య అందుతున్న విషయాన్ని గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి నెల జరిగే పేరెంట్స్ సమావేశాలకు తల్లిదండ్రులు తప్పనిసరిగా హాజరై పిల్లల విద్యా ప్రగతిని తెలుసుకోవాలని కోరారు. చదువుతో పాటు క్రమశిక్షణ, నైతిక విలువలు, సామాజిక బాధ్యత వంటి అంశాలపై కూడా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ఈశ్వర్ గణేష్ మహల్‌లో ఘనంగా సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠనం



**పాల్వంచ, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:** వర్తక సంఘం ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ ఈశ్వర్ గణేష్ మహల్ ప్రాంగణంలో శనివారం ఉదయం సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసన్నాంజనేయ దేవాలయం మహిళా భజన బృందం, బాబా వారి గుడి డోలక్ బృందం సభ్యులతో పాటు పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు. భక్తిగీతాలు, సంకీర్తనలతో శ్రీ ఈశ్వర్ గణేష్ మహల్ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. పూజా కార్యక్రమం అనంతరం రమ్య–కిరణ్ దంపతులు, ప్రకాష్–రాజ్యలక్ష్మి దంపతులు, ఉత్సవ కమిటీ సంయుక్త సౌజన్యంతో సమకూర్చిన రెండు ఆకర్షణీయమైన ఫ్యాన్సీ చీరలకు లక్కీ డ్రా నిర్వహించారు. ఈ డ్రాలో రాయపూడి జయ, మోహన విజేతలుగా నిలిచి చీరలను గెలుచుకున్నారు. కార్యక్రమాన్ని ఉత్సవ కమిటీ అధ్యక్షులు చలవాది ప్రకాష్, ప్రధాన కార్యదర్శి గూడెపు శ్రీనివాస్ సేవాదళ్ మహిళా అధ్యక్షురాలు పెండ్యాల రోజాలక్ష్మి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గుబ్బ దుర్గ భారతి, వంకధార ఇందిరా, తాటిపల్లి దీప్తి, కొప్పరపు సౌజన్య, రూప, మాధవి, జ్యోతి, సుష్మ, తాటికొండ స్వప్న, చిరునోముల నాగ, విశ్వాంబరి, బచ్చు సువర్ణ, రేపాక పద్మజ, విమల, సులోచన, సుజాత తో పాటు ఉత్సవ కమిటీ ప్రతినిధులు, పట్టణ ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండాలి

- ప్రభుత్వ ఆసుపత్రులకు వస్తున్న మందులు ఎక్కడికి పోతున్నాయి?
- డీఎంహెచ్ఓకు పీవైఎల్, పీఓడబ్ల్యూ వినతి పత్రం



**పాల్వంచ, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు 24 గంటలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ ఆసుపత్రులకు సరఫరా అవుతున్న మందులు పేద ప్రజలకు పూర్తిస్థాయిలో అందేలా చూడాలని డిమాండ్ చేస్తూ ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్), ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎంహెచ్ఓ)కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షులు ముసలి సతీష్, పీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు ఆది లక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల కొరతను తక్షణమే పరిష్కరించాలని కోరారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తున్న కొంతమంది వైద్యులు సొంతంగా ప్రైవేట్ ఆసుపత్రులు నిర్వహిస్తూ ప్రభుత్వ విధులకు సక్రమంగా హాజరు కావడం లేదని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలి

జిల్లాలో వర్షాల కారణంగా జ్వరాలు, ఇతర అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయని, ముఖ్యంగా మారుమూల ప్రాంతాల్లో నివసించే గిరిజన, ఆదివాసీ ప్రజలు వైద్య సేవలు పొందేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ప్రతి గ్రామంలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందకపోవడంతో పేద ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి అధిక మొత్తంలో ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు వెచ్చించి మందులు సరఫరా చేస్తున్నప్పటికీ అవి ప్రజలకు చేరడం లేదని ఆరోపిస్తూ, మందుల పంపిణీ వ్యవస్థపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

### వైద్య సేవలపై సర్వే.. దశలవారీ ఆందోళన

ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యుల పని తీరు, మందుల పంపిణీ, పరీక్షా కేంద్రాల నిర్వహణపై పీవైఎల్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించనున్నట్లు నాయకులు తెలిపారు. సర్వేలో వెలుగులోకి వచ్చే అంశాల ఆధారంగా దశలవారీగా ఆందోళనలు చేపడతామని ప్రకటించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఖాళీగా ఉన్న వైద్యులు, నర్సుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, పేద గిరిజన ప్రజలకు మెరుగైన వైద్య సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ కొత్తగూడెం పట్టణ అధ్యక్షులు లిక్కి నరేష్, కార్యదర్శి రాజేష్, ములకలపల్లి మండల అధ్యక్షులు బత్తుల నాగరాజు, దుమ్ముగూడెం మండల నాయకులు కుంజ జోగారావు, మడకం రాజేష్, పీఓడబ్ల్యూ నాయకురాళ్లు ఇంటికీ లక్ష్మి, లలితకుమారి, పద్మ, నాగలక్ష్మి, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీల హక్కుల పరిరక్షణకు అక్టోబర్ 5న మహాధర్నా

- ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక పిలుపు



**దమ్మపేట, సెప్టెంబరు. 19, (ప్రజా జ్యోతి):** ఆదివాసీల హక్కులు, భూములు, విద్య, ఉద్యోగాలు, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్యానికి రాజ్యాంగం కల్పించిన రక్షణలను పరిరక్షించేందుకు అక్టోబర్ 5న కొత్తగూడెం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ముట్టడి, మహాధర్నాను విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పాల్వంచ పట్టణంలో శనివారం కరపత్రాలను విడుదల చేశారు.




ఐదో షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల భూములు, హక్కులు, వనరుల పరిరక్షణకు 1/70 చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. 1/70 చట్టాన్ని సవరించాలంటూ సుప్రీంకోర్టులో దాఖలైన కేసుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే స్పందించి ఆదివాసీల హక్కులను కాపాడే విధంగా కౌంటర్ పిటిషన్ దాఖలు చేయాలని కోరారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల అక్రమ ఆక్రమణలను అరికట్టి, చట్టవిరుద్ధ లావాదేవీలపై చర్యలు తీసుకోవాలని అన్నారు. జి.ఓ.ఎం.ఎస్. నం..3 స్థానంలో కొత్త జీవో తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ ప్రాంతంలోని 29 శాఖల్లో ఆదివాసీ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. యువతకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలతో పాటు కోచింగ్, హాస్టళ్లలో సముచిత అవకాశాలు కల్పించాలని కోరారు. ఆదివాసీల హక్కుల పరిరక్షణకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ప్రాంతాల్లో చట్టాల ఉల్లంఘనలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీలంతా పార్టీలకు, రాజకీయాలకు అతీతంగా ఐక్యంగా నిలిచి హక్కుల సాధన కోసం ఉద్యమించాలని నాయకులు పిలుపునిచ్చారు. అక్టోబర్ 5న కొత్తగూడెంలో నిర్వహించే మహాధర్నాకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. "మన భూములు.. మన హక్కులు.. మన భవిష్యత్తు" అనే నినాదంతో ఉద్యమాన్ని బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

## పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజం

- చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన
- పోషణ మాసం కార్యక్రమంలో కార్పొరేటర్ బత్తుల మధుచంద్



**పాల్వంచ, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:** పోషకాహారంతోనే ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని పాల్వంచ 38వ డివిజన్ కార్పొరేటర్ బత్తుల మధుచంద్ అన్నారు. శుక్రవారం టీచర్స్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషణ మాసం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు పోషకాహారం, ఆరోగ్యం, పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారం, ప్రీ–స్కూల్ విద్య, ఆరోగ్య సేవలను పరిశీలించారు. పిల్లల ఆరోగ్యకరమైన ఎదుగుదలకు సమతుల్యమైన పోషకాహారం ఎంతో అవసరమని కార్పొరేటర్ తెలిపారు.

### చిన్నారుల అన్నప్రసన్న, గర్భిణీల శ్రీమంతం

అనంతరం అంగన్‌వాడీ చిన్నారుల అన్నప్రసన్న కార్యక్రమంలో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గర్భిణీ మహిళల శ్రీమంతం కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు అందించారు. గర్భధారణ సమయంలో మహిళలు పోషకాహారం తీసుకోవడంతో పాటు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆరోగ్యవంతమైన తల్లి–ఆరోగ్యవంతమైన శిశువు–బలమైన సమాజం అనే లక్ష్యంతో అంగన్‌వాడీ కేంద్రాలు అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ బత్తుల మధుచంద్ కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగమణి, బీఆర్ఎస్ నాయకులు తుంగపాటి లక్ష్మీనారాయణ, అంగన్‌వాడీ టీచర్లు జిలేపల్లి సుగుణవాణి, పెరుమాళ్లపల్లి సౌభాగ్యం, నాగులు, గడ్డం గీత, కాల్వ కలావతి, ఏఎన్ఎం కృపామణి, ఆయాలు మహబూబీ, అన్నపూర్ణ, చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణీ మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

# బ్యాగ్‌కు సెలవు.. బాల్యానికి వెలుగు!

- మాస్టర్ ఈ.కే విద్యాలయం స్కూల్‌లో 'నో-బ్యాగ్ డే'తో విద్యార్థుల సమగ్ర వికాసానికి వినూత్న అడుగులు
- ఆటల్లో ఆనందం.. ప్రయోగాల్లో విజ్ఞానం.. కళల్లో సృజనాత్మకత.. ప్రకృతితో మమేకం
- చదువు అంటే పుస్తకాలు మాత్రమే కాదు.. జీవితాన్ని నేర్పించడమూ విద్యే!













**చుంచుపల్లి, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:** విద్యార్థులపై పుస్తకాల బరువు, చదువుపై ఒత్తిడిని తగ్గిస్తూ.. విద్యను మరింత ఆనందదాయకంగా, అనుభవాత్మకంగా మార్చే దిశగా మాస్టర్ ఈ.కే విద్యాలయం ప్రత్యేక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తోంది. తెలంగాణ విద్యాశాఖ సూచించిన 'నో – బ్యాగ్ డే' విధానాన్ని అనుసరిస్తూ విద్యార్థుల్లో విద్యతో పాటు సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సామాజిక స్పృహ పెంపొందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

**బ్యాగ్ లేని రోజు.. కొత్తగా నేర్చుకునే రోజు!**

సాధారణ తరగతి బోధనకు భిన్నంగా 'నో–బ్యాగ్ డే' సందర్భంగా విద్యార్థులను వివిధ ఆటలు, క్విజ్‌లు, సైన్స్ ప్రయోగాలు, కళలు, నాటికలు, తోట పని, క్రీడలు, ప్రకృతి పరిశీలన వంటి కార్యక్రమాల్లో భాగస్వాములను చేస్తున్నారు.దీంతో విద్యార్థులు కేవలం పుస్తకాల్లో చదివిన విషయాలను గుర్తుపెట్టుకోవడమే కాకుండా.. చూసి, చేసి, అనుభవించి నేర్చుకునే అవకాశం పొందుతున్నారు.

**'ఎందుకు? ఎలా?' అనే ప్రశ్నించే తత్వం**

సైన్స్ ప్రయోగాలు, క్విజ్‌లు వంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో ప్రశ్నించే తత్వాన్ని, పరిశీలనా శక్తిని పెంచేందుకు దోహదపడుతున్నాయి. సమస్యలను స్వయంగా ఆలోచించి పరిష్కరించే విధంగా కార్యకలాపాలను రూపొందించడం ద్వారా విద్యార్థుల్లో తార్కిక ఆలోచనా విధానం పెంపొందించే అవకాశం ఉంటుంది.

**ఆటలతో ఆరోగ్యం.. జట్టుతో నాయకత్వం**

క్రీడలు, సమూహ కార్యకలాపాల ద్వారా విద్యార్థుల్లో జట్టు స్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, పరస్పర సహకారం వంటి విలువలను పెంపొందించే ప్రయత్నం చేస్తున్నారు. గెలుపు–ఓటములను సమానంగా స్వీకరించడం, ఇతరులను గౌరవించడం వంటి జీవన నైపుణ్యాలను కూడా పిల్లలు నేర్చుకునే అవకాశం కలుగుతోంది.

**క్రీడా కళలు.. నాటికలు.. సృజనాత్మక ఆలోచనలు**

క్రీడా,చిత్రలేఖనం, కళలు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థుల్లోని సృజనాత్మక ప్రతిభను వెలికితీస్తున్నాయి. ప్రతి విద్యార్థిలో ప్రత్యేకమైన ప్రతిభ ఉంటుందని గుర్తించి, దానిని వ్యక్తీకరించేందుకు వేదిక కల్పించడం విద్యలో కీలకమైన అంశంగా మారుతోంది.

**ప్రకృతితో అనుబంధం.. పర్యావరణంపై బాధ్యత**

మొక్కల పెంపకం, ప్రకృతి పరిశీలన వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రత, ప్రకృతి పట్ల బాధ్యత వంటి విలువలను చిన్న వయసులోనే పెంపొందించే అవకాశం ఉంది.

**స్థానిక కళాకారులతో పరిచయం.. మన సంస్కృతిపై అవగాహన**

స్థానిక కళాకారులు, నైపుణ్యాలు, సంప్రదాయాలతో విద్యార్థులను పరిచయం చేయడం ద్వారా పాఠ్యపుస్తకాలకు మించి మన ప్రాంతీయ సంస్కృతి, కళలు, జీవన విధానాలపై అవగాహన కల్పించే ప్రయత్నం కూడా ఈ తరహా కార్యక్రమాల్లో ముఖ్యమైన భాగం.

**ఈ కార్యక్రమం యొక్క ముఖ్యాంశాలు**

**విద్యార్థులపై పుస్తకాల భారం తగ్గించే ప్రయత్నం**
**చదువును ఆనందదాయకంగా మార్చే అనుభవాత్మక అభ్యాసం**
**సైన్స్ ప్రయోగాలతో పరిశీలనా, తార్కిక ఆలోచనా శక్తి**
**క్రీడలతో శారీరక దారుఢ్యం, జట్టు స్ఫూర్తి**
**కళలు, నాటికలతో సృజనాత్మకత, వ్యక్తీకరణ నైపుణ్యం**
**ప్రకృతి, పర్యావరణంపై అవగాహన**
**క్విజ్‌లతో సాధారణ జ్ఞానం, ఆలోచనా సామర్థ్యం**
**స్థానిక కళాకారులతో పరస్పర అనుభవం**
**నాయకత్వం, కమ్యూనికేషన్, సహకారం వంటి జీవన నైపుణ్యాల అభివృద్ధి**
**పుస్తక జ్ఞానంతో పాటు జీవిత నైపుణ్యాలకు ప్రాధాన్యం**

**పిల్లల భవిష్యత్తుకు కొత్త నిర్వచనం**

"మార్కులు సాధించడం మాత్రమే విద్య లక్ష్యం కాదు.. ఆలోచించే, ప్రశ్నించే, సృజనాత్మకంగా పనిచేసే, సమాజంతో కలిసి ముందుకు సాగే వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దడమే అసలైన విద్య."'నో – బ్యాగ్ డే'ను ఈ దృక్పథంతో నిర్వహిస్తే అది ఒక రోజు పుస్తకాలకు సెలవు ఇవ్వడం మాత్రమే కాకుండా.. విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే వేదికగా మారుతుంది. మాస్టర్ ఈ.కే విద్యాలయంలో ఇటువంటి కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇవ్వడం ద్వారా విద్యను తరగతి గది గోడలకే పరిమితం చేయకుండా జీవితంతో అనుసంధానం చేసే ప్రయత్నం కనిపిస్తోంది.



## మర్కోడులో ఘనంగా మహా అన్నదానం



**ఆళ్ళపల్లి, సెప్టెంబర్ 19 (ప్రజాజ్యోతి):** మండల పరిధిలోని మర్కోడు బొడ్రాయి సెంటర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద శనివారం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వినాయక నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆరో రోజు తాళ్లపల్లి రామ్మూర్తి–ఇందిర దంపతుల ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టారు. ముందుగా వినాయకుడికి ప్రత్యేక అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామానికి చెందిన భక్తులు, మహిళలు, యువతతో పాటు వందలాది మంది పాల్గొని స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదాలు స్వీకరించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్ద తాళ్లపల్లి వెంకన్న, వ్యాపారులు తాళ్లపల్లి నాగేష్, తాటికొండ వెంకటాచారి, అనుమోల వెంకటేశ్వరరావు, పొదిల రాము, వార్డు సభ్యులు తాళ్లపల్లి ఎల్ల గౌడ్, కేక్కర్ల సునీత, కొమరం కృష్ణం రాజు, యువత చిరంజీవి, నవీన్, రంజిత్, రవి, శ్రావణ్, సతీష్, శేఖర్, వేణు, నవజీవన్, వినయ్, వికాస్, వెంకన్న, చరణ్, ఉదయ్, మనీ తదితరులు పాల్గొన్నారు.

## హెడ్ కానిస్టేబుల్ రఘురామిరెడ్డికి ఏఎస్ఐగా పదోన్నతి



**పాల్వంచ, సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి:** పాల్వంచ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రఘురామిరెడ్డికి ఉన్నతాధికారులు ఏఎస్ఐ గా పదోన్నతి కల్పించడంపై బీఆర్ఎస్ పార్టీ నాయకులు దాసరి నాగేశ్వరరావు హర్షం వ్యక్తం చేశారు. దాసరి నాగేశ్వరరావు మాట్లాడుతూ వృత్తి పట్ల క్రమశిక్షణ, అంకితభావం, నీతి నిజాయితీతో విధులు నిర్వహిస్తున్న రఘురామిరెడ్డి సేవలను గుర్తించి పదోన్నతి కల్పించడం అభినందనీయమన్నారు. పదోన్నతితో మరింత బాధ్యత పెరిగిందని, పట్టణ ప్రజలకు న్యాయం చేస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ఏఎస్ఐగా పదోన్నతి పొందిన రఘురామిరెడ్డికి తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

## పోషణతోనే సంపూర్ణ ఆరోగ్యం

- ఉప్పాకలో ఘనంగా పోషణ మాస ఉత్సవాలు
- తల్లుల అనుభవాల పంచుకోవడంతో ప్రత్యేక కార్యక్రమం



**పినపాక, సెప్టెంబర్ 19(ప్రజాజ్యోతి)** పోషణ మాస ఉత్సవాల్లో భాగంగా ఉప్పాక గ్రామపంచాయతీలో శనివారం ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్ కె. అనురాధ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆరోగ్యవంతమైన పిల్లల తల్లులు, పోషణ లోపం ఉన్న పిల్లల తల్లుల మధ్య అనుభవాల పంచుకునే కార్యక్రమం నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా పిల్లలకు అందించే పోషకాహారం, ఆహారపు అలవాట్లు, ఇంటి వద్ద పాటిస్తున్న మంచి పోషణ పద్ధతులు తదితర అంశాలపై తల్లులు తమ అనుభవాలను పరస్పరం పంచుకున్నారు. పిల్లల ఆరోగ్యం, పరిశుభ్రత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించారు.పోషణ లోపం ఉన్న పిల్లల తల్లులకు పిల్లల ఆరోగ్య పరిస్థితులకు అనుగుణంగా తీసుకోవాల్సిన ఆహారం, పాటించాల్సిన ఆరోగ్యకరమైన అలవాట్లపై సూచనలు, కౌన్సెలింగ్ అందించారు. అవసరమైన పిల్లలను ఆరోగ్య, పోషణ సేవలకు అనుసంధానం చేయాల్సిన ఆవశ్యకతను వివరించారు.పిల్లల సంపూర్ణ ఆరోగ్యానికి పోషకాహారం ఎంతో కీలకమని, తల్లిదండ్రులు పిల్లల ఆహారం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని సెక్టార్ సూపర్వైజర్ కె. అనురాధ సూచించారు. ఇంటి నుంచే ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్‌ఎం సుభద్ర, పాఠశాల సిబ్బంది, పిల్లల తల్లులు, విద్యార్థులు, అంగన్వాడీ టీచర్లు రమాదేవి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## మణుగూరులో జోరు వర్షం

- తగ్గని వినాయక భక్తుల ఉత్సాహం

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు సెప్టెంబర్ 19, ప్రజాజ్యోతి :** – వినాయక నిమజ్జనోత్సవం సందర్భంగా మణుగూరులో భక్తుల ఉత్సాహం వెల్లువెత్తుతోంది. జోరుగా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా వినాయక భక్తులు గణనాథులను నిమజ్జనానికి తరలిస్తున్నారు.గత కొన్ని రోజులుగా ప్రతిష్ఠించిన వినాయక విగ్రహాలకు పూజలు చేసిన భక్తులు, శనివారం డప్పు వాయిద్యాలు, భజనల నడుమ ఊరేగింపుగా బయలుదేరారు. వర్షం కారణంగా రోడ్లపై నీరు నిలిచినా, భక్తుల్లో మాత్రం ఎక్కడా ఉత్సాహం తగ్గలేదు. 'గణపతి బప్పా మోరియా' నినాదాలతో మణుగూరు పట్టణం మార్మోగుతోంది. నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. పంచాయతీ,మున్సిపల్, పోలీస్ అధికారుల సిబ్బంది నిమజ్జన ప్రాంతంలో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. వర్షం ఉన్నప్పటికీ భక్తి శ్రద్ధలతో నిమజ్జన కార్యక్రమం ప్రశాంతంగా కొనసాగుతోంది.

## పాత కక్షలతోనే దాడా? వలస గిరిజనుడిపై వేటు

- భద్రాద్రి జిల్లాలో కలకలం.. గిరిజనుడిపై ఆయుధాలతో దాడి, పరిస్థితి విషమం
- హత్య కేసు నిందితుడిపై దాడి.. ఆసుపత్రికి తరలింపు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / కరకగూడెం, సెప్టెంబర్ 19, ప్రజా జ్యోతి :** –కరకగూడెం మండలం అశ్వారావుపాడులో శనివారం దారుణం చోటుచేసుకుంది. వలస గిరిజనుడైన వజ్జా భీమరాజుపై గుర్తుతెలియని వ్యక్తులు ఆయుధాలతో దాడికి పాల్పడ్డారు. తలపై బలమైన గాయాలు కావడంతో ఆయన పరిస్థితి విషమంగా మారింది. స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రుడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో అశ్వారావుపాడు పరిసర ప్రాంతాల్లో ఉద్రిక్తత నెలకొంది. కాగా, దాడికి గురైన వజ్జా భీమరాజు పలు కేసుల్లో ముద్దాయిగా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. గతంలో కరకగూడెం మండలంలో జరిగిన కోవసి వెంకటేశ్వర్లు హత్య కేసుతో పాటు, అటవీ శాఖ అధికారిపై దాడి చేసిన ఘటనలో కూడా భీమరాజు నిందితుడిగా ఉన్నాడని తెలిపారు. ఈ నేపథ్యంలో పాత కక్షలతోనే ఈ దాడి జరిగి ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దాడికి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తుల కోసం పోలీసులు గాలింపు చేపట్టారు.

## కానిస్టేబుల్ స్వామికి ఏఎస్సైగా పదోన్నతి



**బూర్గంపహాడ్, సెప్టెంబరు 19 (ప్రజా జ్యోతి ):** పోలీసుశాఖలో కానిస్టేబుల్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన రెంటపల్లి స్వామి అంచెలంచెలుగా పదోన్నతులు పొందుతూ ఏఎస్సైగా నియమితులయ్యారు. విధి నిర్వహణలో చూపిన అంకితభావం, క్రమశిక్షణ, బాధ్యతాయుత సేవలకు గుర్తింపుగా ఆయనకు ఏఎస్సైగా పదోన్నతి లభించింది.జిల్లా పోలీసు శాఖలో జరిగిన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ బిరుదరాజు రోహిత్‌రాజు చేతుల మీదుగా రెంటపల్లి స్వామి ఏఎస్సై పదోన్నతికి సంబంధించిన నియామక పత్రాన్ని అందుకున్నారు. అనంతరం ఆయన బూర్గంపహాడ్ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్సైగా బాధ్యతలు స్వీకరించారు.కానిస్టేబుల్‌గా పోలీసుశాఖలో చేరిన స్వామి తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ క్రమంగా ఉన్నత పదవులకు ఎదిగారు. తాజా పదోన్నతితో ఏఎస్సైగా బాధ్యతలు చేపట్టడం పట్ల పోలీస్‌స్టేషన్ సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా ఎస్సైలు మేడ ప్రసాద్, నాగభిక్షం, రామ్మూర్తితో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది రెంటపల్లి స్వామిని అభినందించారు. కొత్త బాధ్యతల్లోనూ సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూ పోలీసుశాఖకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. స్వామి తనకు లభించిన పదోన్నతికి సహకరించిన ఉన్నతాధికారులు, సహచర సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

# దోచుకునోడికి దోచుకున్నంతా..?

- అశ్వారావుపేటలో గోల్డ్ లోన్ మాయాజాలంపై అనుమానాలు
- ఒకరి పేరుతో స్లిప్.. మరోరి పేరుతో బంగారం? ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ లకు ఎలా చేరింది?




**అశ్వారావుపేట: ప్రజా జ్యోతి సెప్టెంబర్ 19**

అశ్వారావుపేటలో వెలుగులోకి వచ్చిన సీఎస్ బీ బ్యాంక్ గోల్డ్ లోన్ వ్యవహారం పలు అనుమానాలకు తావిస్తోంది. బ్యాంకులో పనిచేస్తున్న 'సుబ్బు' అనే వ్యక్తి పేరును ప్రస్తావిస్తూ, బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన బంగారం శ్రీరామ్ గోల్డ్ ఫైనాన్స్ తో పాటు పట్టణంలోని పలువురు ప్రైవేట్ గోల్డ్ ఫైనాన్స్ వ్యాపారుల వద్ద తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ ఆరోపణలపై పూర్తి స్థాయి దర్యాప్తు జరిగితేనే అసలు విషయం వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

### స్లిప్పులు ఒకరి పేరు.. బంగారం మరొకరి పేరు?

ఈ వ్యవహారంలో అత్యంత కీలకమైన అంశంగా గోల్డ్ లోన్ స్లిప్పులపై ఉన్న పేర్లు, వాస్తవంగా తాకట్టు పెట్టిన బంగారం ఎవరిది అన్నది మారింది. ఒకరి పేరుతో ఉన్న స్లిప్పులను చూపిస్తూ అదే బంగారాన్ని మరో వ్యక్తి పేరుతో ఇతర గోల్డ్ ఫైనాన్స్ సంస్థల్లో తాకట్టు పెట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఒకే బంగారం వివిధ సంస్థల్లో తాకట్టు పెట్టబడిందా?ఒకే కస్టమర్ కు సంబంధించిన KYC పత్రాలు ఇతర లావాదేవీలకు ఉపయోగించారా?బ్యాంకు రికార్డులు గోల్డ్ ప్యాకెట్లు, స్లిప్పులు, KYC వివరాలను సరిపోల్చితే ఏమి బయటపడుతుంది? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

### సామాన్యుల KYC పత్రాల సంగతేంటి?

ఈ వ్యవహారంలో మరో ఆందోళనకర అంశం సామాన్య ఖాతాదారుల KYC పత్రాల వినియోగం. తమ పేరు తో ఉన్న పత్రాలు, గోల్డ్ లోన్ స్లిప్పులతో సంబంధం ఉన్నాయంటూ కొం దరు వ్యక్తులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం.తమ బంగా రం, తమ పత్రాల విషయంలో స్పష్టత కోరుతున్న ఖాతాదారులకు కొన్ని పత్రాలు డూప్లికేట్ అని, మరికొన్ని ఒరిజినల్ అని చెబుతూ వెనక్కి పంపుతున్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. బ్యాంకు సిబ్బందికి తెలియకుండానే సాధ్యమా?గోల్డ్ లోన్ లో బంగారం స్వీకరణ, పరిశీలన, ప్యాకింగ్, KYCధృవీకరణ, లోన్ నమో దు, విడుదల వంటి ప్రక్రియలకు రికార్డులు ఉంటాయి. అలాంటప్పుడు ఒకే బంగారం ఒకటి కంటే ఎక్కువ చోట్ల తాకట్టు పెట్టబడిందనే ఆరోపణలు నిజమైతే ఆ బంగారం ఇప్పుడు, ఎవరి ఆధీనంలో ఉంది? ఏ రికార్డులో ఎలా నమోదైంది? అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంటుంది.

## అన్నాదైవం చెరువుకు గోదావరి జలాలు

- సీతారామ ప్రాజెక్టు ద్వారా నీటి తరలింపుతో రైతుల్లో హర్షం



**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 19, (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని అన్నాదైవం చెరువుకు సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను తరలించారు. చెరువులోకి గోదావరి జలాలు చేరడంతో రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ నీటితో వ్యవసాయానికి ఎంతో ప్రయోజనం చేకూరనుందని, రెండు పంటలకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందని రైతులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సుగ్గల నరసింహారావు, సున్నం సమ్మేలు, రైతులు పలగాని నాగేంద్ర బాబు, పాడియా జోగారావు, లాకావత్ సత్యనారాయణ, మల్లెల స్వామి, వడ్డే నరసింహారావు, ఇజ్జిగిరి సత్యం తదితర గ్రామస్తులు పాల్గొని గోదావరి జలాలు చెరువుకు చేరడంపై హర్షం వ్యక్తం చేశారు.

## వినాయకుడి సన్నిధిలో భక్తులకు అన్నదానం

- గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎస్సై విజయసింహారెడ్డి





**అన్నపురెడ్డిపల్లి, సెప్టెంబర్ 19 (ప్రజా జ్యోతి ):** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని రాజపురం గ్రామం రెడ్డి బజార్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సుమారు 600 మందికి భోజనం అందించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సై విజయసింహారెడ్డి భక్తులకు భోజన వితరణను ప్రారంభించారు. వినాయక మండపాల వద్ద భక్తులకు అన్నదానం చేయడం అభినందనీయమని ఆయన అన్నారు. నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఆనందోత్సాహాలతో నిర్వహించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వెంకటరామిరెడ్డి, కవితారాణి, గణపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.